అక్రమ నిర్మాణాలకు నేతల అండ!

- ఆరు భవనాలకు నోటీసులు జారీ
- అధికారులకు తలనొప్పిగా నేతల ఒత్తిళ్లు
- జీహెచ్‌ఎంసీ ఆదాయానికి గండి
- ఆదర్శంగా ఉండాలని సూచనలు
- చర్యలు తీసుకోవాల్సిందేనని జనం డిమాండ్


నిబంధనలకు విరుద్ధంగా చేపట్టారని అధికారులు నోటీసులు జారీ చేసిన భవనం

కాప్రా: అక్రమనిర్మాణలకు జీహెచ్‌ఎంసీ కాప్రా సర్కిల్ అడ్డాగా మారింది. ప్రజాపాలనలో ప్రజలకు అండగా అందరికీ ఆదర్శంగా, మార్గనిర్దేశకులుగా ఉండాల్సిన రాజకీయ నాయకులు తమకున్న పలుకుబడిని ఉపయోగించుకుని అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ అండగా నిలుస్తున్నారు. దీంతో జీహెచ్‌ఎంసీ ఆదాయానికి గండికొడుతున్నారు. తీసుకున్న అనుమతులకు మించి అదనపు ఫ్లోర్లు నిర్మించేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ కాప్రా సర్కిల్ అధికారులపై ఒత్తిడి తెచ్చి చర్యలు తీసుకోకుండా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఉన్నతాధికారులు దృష్టి సారించాలి...

కాప్రా సర్కిల్ పరిధిలో జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు పర్యటించి నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కళ్ల ముందే అక్రమ నిర్మాణాలు కొనసాగుతుంటే నోటీసులు ఇచ్చి ఎవరో ఒత్తిళ్లకు తలొగ్గి చూసీచూడనట్లుగా వ్యవహరించడమేంటని స్థానికులు ప్రశ్నించుకుంటున్నారు. పలువురి ఆదర్శంగా ఉండాల్సిన నాయకుడు ఇలా అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించకుండా ఉండాలని పలువురు సూచిస్తున్నారు. అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తే ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి ప్రజలను మోసం చేసినట్లు కాదా అని జనం వాపోతున్నారు.

నోటీసులు జారీ...

కాప్రా సర్కిల్‌లో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలను గుర్తించి టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేశారు. సర్కిల్ పరిధిలో ప్రస్తుతం 8 భవనాలు నిబంధనలకు విరుద్ధంగా చేపట్టారని గుర్తించిన అధికారులు అందులో 6 భవనాలకు నోటీసులు జారీ చేశారు. వీటికి రెండు సార్లు నోటీసులు ఇచ్చామని, మరో మారు నోటీసు ఇచ్చి నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలను కూల్చేస్తామని జీహెచ్‌ఎంసీ అధికారులు చెబుతున్నారు.

తలనొప్పిగా మారిన నేతల ఒత్తిళ్లు..

అక్రమ నిర్మాణాలపై చర్యలకు ముందుకెళ్తున్నా రాజకీయ నాయకుల ఒత్తిళ్లు జీహెచ్‌ఎంసీ అధికారులకు తలనొప్పిగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన కట్టడాలపై చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నా సదరు నిర్మాణదారులకు అండగా ఉన్న రాజకీయ నేతలను చూసి తమకెందుకులే గొడవ అంటూ చూసీచూడనట్లుగా వదిలేస్తున్నారు. కాప్రా డివిజన్‌లో ఓ భవనం సిల్ట్+2కు అనుమతి తీసుకుని అదనంగా మరో ఫ్లోర్ నిర్మించేస్తున్నారు. అది గుర్తించిన అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇంకేముందు వారికి అధికార పార్టీకి చెందిన ఓ ప్రముఖ రాజకీయ నేత నుంచి ఒత్తిడి వచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చర్యలు తీసుకోవాల్సిందే..

నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణలపై చట్టరీత్య చర్యలు తీసుకోవాల్సిందేనని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పేదలు తెలిసీతెలియక చిన్న పొరపాటు చేస్తే చర్యలు తీసుకుంటారు. అదే పెద్దపెద్ద భవనాలు నిబంధనలకు విరుద్ధంగా ఉంటే వారికి అండగా రాజకీయ నేతలు ఉండటమేంటని ప్రశ్నిస్తున్నారు. ప్రజాపాలనలో ప్రజలకు మేలు చేయాలని కానీ ఇలా ప్రభుత్వ ఆదాయానికి గండిగొట్టాలని చూసేవారికి అండగా ఉండి అధికారులపై ఒత్తిడి తేవడమేంటని జనం వాపోతున్నారు.



కాప్రా సర్కిల్ కార్యాలయం

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: ముఖ్యమంత్రి సహాయనిధి పేదల పాలిట వరమని కార్పొరేటర్ ప్రభుదాస్ అన్నారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో మంజూరైన రూ.30 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును న్యూనర్సింహ్మనగర్‌కు చెందిన లబ్ధిదారు దిడ్డిగ రేణుకకు శుక్రవారం హెచ్‌బీకాలనీ వార్డు కార్యాలయంలో అందజేశారు. ఆపదలో ఉన్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ అపన్నహస్తంలా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ పనులను వేగవంతం చేయాలి


ఈసీనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్

కుషాయిగూడ: ఈసీనగర్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. శుక్రవారం ఆమె ఇంజనీరింగ్ అధికారులు, కాలనీ సంక్షేమసంఘం ప్రతినిధులతో కలిసి ఈసీనగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో మాట్లాడారు. కాలనీ అవసరాలు, అభివృద్ధి పనులపై చర్చించారు. కార్యక్రమంలో డీఈ బాలకృష్ణ, బూడిద శ్రావణ్‌కుమార్‌గౌడ్, నవనీత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంటేషన్‌కు సమయం ఇవ్వండి

మల్లాపూర్: స్కూల్ ఆటో, వ్యాన్లకు డాక్యుమెంటేషన్‌కు ఆర్టీఏ అధికారులు సమయం ఇవ్వాలని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు వేముల మారన్న అన్నారు. ఈ విషయమై శుక్రవారం ఉప్పల్ రవాణాశాఖ అధికారి రవీందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మారన్న మాట్లాడుతూ..డాక్యుమెంటేషన్ పేరుతో స్కూల్ ఆటోలు, వ్యాన్లు సీజ్ చేస్తుండటంతో డ్రైవర్లు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్యుమెంటేషన్‌కు గడువు ఇస్తే డ్రైవర్లకు మేలు చేసినవారవుతారని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ నాయకులు మహేష్, పాండునాయక్, సాయికుమార్, రామాంజీ, భూపతిఅశోక్ పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ వార్షికోత్సవ కరపత్రం ఆవిష్కరణ



రామంతాపూర్ : మహా భాగ్యనగర బ్రాహ్మణ సేవా సమితి (ఎంబీబీఎస్) 19వ వార్షికోత్సవ వేడుకల కరపత్రాన్ని శుక్రవారం వెంకటరెడ్డినగర్ పోచమ్మ దేవాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంబీబీఎస్ అధ్యక్షుడు మహాదేవభట్ల లక్ష్మణ్ ప్రసాద్ శర్మ మాట్లాడుతూ మల్లాపూర్ వీఎస్‌ఆర్ గార్డెన్‌లో నిర్వహించే ఈ వేడుకల్లో హోమాలు, యజ్ఞాలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎలమంచిలి రామకృష్ణ, కోశాధికారి మధునూరి మహాదేవ శర్మ, కన్వీనర్ సిరిసిల్ల రాంప్రసాద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

భారీగా గంజాయి పట్టివేత



ఉప్పల్: ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం ఉప్పల్‌లో భారీగా గంజాయిని స్వాధీనం చేసుకుంది. ఏసీపీ ఆర్.కిషన్ తెలిపిన వివరాల ప్రకారం .. ఉప్పల్ విజయపురి కాలనిలో భారీగా గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం అందుకున్న అధికారులు శుక్రవారం అతిడి ఇంటిపై దాడి చేసి 1.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితున్ని ఉప్పల్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు.

☛ పాత బస్తీ ధూల్‌పేటలో శివలాల్ నగర్‌లో కృష్ణసింగ్‌ను అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి 1.100 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు అధికారి అంజిరెడ్డి తెలిపారు. ఈ కేసులో కృష్ణసింగ్‌తో పాటు బీమ్‌సింగ్, రేణుక భాయ్, గోపాల్‌సింగ్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితులను ధూల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం


చికోలే శ్రీను (ఫైల్)

కుషాయిగూడ: కూలీ పనికి వెళ్లిన యువకుడు అదృశ్యమైన సంఘటన శుక్రవారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, కృష్ణానగర్ కాలనీకి చెందిన చికోలే శ్రీను (26) ఆరు నెలల క్రితం కూలీ పనికి వెళ్తున్నట్లు చెప్పి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అతడి కోసం గాలించినా ఫలితం లేక పోవడంతో శుక్రవారం అతడి సోదరుడు చికోలే శ్యామ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేశారు.

మరో ప్రాంతంలో యువతి...


తను సాహు(ఫైల్)

మేడిపల్లి: హాస్టల్ నుంచి బయటకు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన సంఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఒరిస్సాకు చెందిన తనుసాహు(21) నాచారంలోని ఓ ప్రైవేట్ టైల్స్ కంపెనీలో పని చేసుకుంటూ.. బోడుప్పల్ టెలిఫోన్ కాలనీలో ఉన్న జనాదాయ ఎన్‌జీవో వసతి గృహంలో ఉంటుంది. ఈనెల 15న హాస్టల్ నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. హాస్టల్ వార్డెన్ శుక్రవారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్యాబోధన


నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాల్లోనే మెరుగైన విద్యాబోధన అందుతుందని దీనిని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకొని పిల్లలను అందులోనే చేర్పించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నేరెడ్‌మెట్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా పాఠ్యపుస్తకాలు, ఉచిత భోజనం అందజేస్తున్నారని, ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటారన్నారు. ఎందరో ప్రముఖులు ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారే అన్నారు.స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ పాఠశాలలకు చేయూత నందించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జయప్రద తదితరులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన

మల్లాపూర్: అంబేద్కర్‌నగర్–కార్తికేయనగర్ మార్గంలో నూతనంగా నిర్మించిన ఆర్‌సీసీ రిటైనింగ్ వాల్‌ను శుక్రవారం కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ పరిశీలించారు. నాచారం పెద్దనాలపై రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టే సమయంలో సమీపంలో పోచమ్మ ఆలయం వద్ద ఉన్న రిటైనింగ్ వాల్ కూలిపోయింది. దీంతో ఆ స్థానంలో ఆర్‌సీసీ రిటైనింగ్ వాల్ నిర్మించారు. రాబోయే బోనాల పండుగను దృష్టిలో పెట్టుకుని వంతెనపై నుంచి రాకపోకలు సాగేలా చూడాలని, వంతెన ఇరువైపుల రోడ్లను త్వరితగతిన పూర్తి చేయాలని, ఆలయం చుట్టూ ఉన్న గుంతలను పూడ్చాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్, బుచ్చన్నగడ్, స్థానిక మహిళలు పాల్గొన్నారు.


రిటైనింగ్ వాల్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

కుషాయిగూడ: ట్రాఫిక్ నిబంధలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని కుషాయిగూడ ఏసీపీ వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చక్రిపురం లారీ అడ్డా వద్ద కుషాయిగూడ లా అండ్ అర్డర్, ట్రాఫిక్ పోలీసులు లారీల యజమానులు, డ్రైవర్లలకు ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ రాచకొండ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈసీఐఎల్–నాగారం రోడ్డు, చర్లపల్లి జైలు రోడ్డు మార్గంలో లారీలు రోడ్లపై పార్కింగ్ చేయకూడదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించి ప్రమాదాలను నివారించాలన్నారు.కార్యక్రమంలో కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి, ఎస్‌ఐ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి..

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

బోడుప్పల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా బోడుప్పల్‌లోని పలు కాలనీల్లో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌బీఆర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు పద్మావతి కాలనీ, ఆర్‌ఎన్‌ఎస్ కాలనీ, బిఎల్ నగర్, రెడ్డీస్ కాలనీ, శుభోదయ కాలనీ, లెక్చరర్స్ కాలనీ, గ్రీన్‌సిటీ కాలనీ, భీంరెడ్డినగర్, ఎన్‌ఐఎన్ కాలనీ, బొల్లిగూడెం, అమ్మసాని వెంకట్‌రెడ్డి కాలనీ, టెలిఫోన్‌కాలనీ, రాజలింగం కాలనీ ఫేస్ 1, 2, సూరజ్‌నగర్, మహాలక్ష్మినగర్, బాలాజీ నగర్‌ల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ద్వారకానగర్ ఫేస్ 1, 2 ,3 ఆంజనేయనగర్, కేశవనగర్, గాయత్రీనగర్, లక్ష్మినగర్(హుడా) విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు.

మల్కాజిగిరి పరిధిలో..

వసంతపురి సబ్‌స్టేషన్ 11 కేవీ గణేష్ టెంపుల్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వసంతపురి కాలనీ, ప్రశాంత్‌నగర్, వెంకటేశ్వరనగర్, శ్రీపురికాలనీ ప్రాంతాల్లో, 11 కేవీ బీజెఆర్‌నగర్ ఫీడర్ పరిధిలో బీజెఆర్‌నగర్, పీవీఎన్‌కాలనీ, సత్తిరెడ్డినగర్, సత్యరాఘవేంద్ర కాలనీ, వెంకటేశ్వరనగర్ ప్రాంతాల్లో, 11 కేవీ సాయిరాం ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు యాదవ్‌నగర్, మధుసూధన్‌నగర్, ఓల్డ్ మల్కాజిగిరి, గీతానగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ గోపాల్ తెలిపారు.

ఆనంద్‌బాగ్ సబ్‌స్టేషన్ పరిధిలో...

11 కేవీ శివపురి కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటలకు మధ్యాహ్నం 1 గంట వరకు శివపురికాలనీ, భ్రమరాంభికనగర్, అష్టభుజాదేవి టెంపుల్ ఏరియా,వెస్ట్ ఆనంద్‌బాగ్ ప్రాంతాల్లో, 11 కేవీ బాల సరస్వతీనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 5.30 వరకు రాజీవ్‌గాంధీనగర్, విష్ణుపురి ఎక్స్‌టెన్షన్, విమలాదేవినగర్, శివపురి కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

గౌతంనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో...

11 కేవీ ఉత్తంనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఉత్తంనగర్, గౌతంనగర్, దయానంద్‌నగర్ ప్రాంతాల్లో, 11 కేవీ దయానంద్‌నగర్ ఫీడర్ పరిధిలో దయానంద్‌నగర్, ఉత్తంనగర్,వాణీనగర్, అనుటెక్స్ ఏరియాలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ కళ్యాణ్ తెలిపారు.

రామంతాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

గోకుల్‌నగర్ మెయిన్ రోడ్డు కెన్యా గ్రౌండ్ అయ్యప్ప టెంపుల్ గోకుల్‌నగర్, ఎండోమెంట్ కాలనీ, ఆర్టీసీ కాలనీ, మీ సేవా, న్యూ గోకుల్‌నగర్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. శ్రీనివాసపురం ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు వెంకటరెడ్డినగర్, నవరంగ్‌గూడ, కామాక్షిపురం, వాసవినగర్, వివేక్‌నగర్, యాదయ్య హోటల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ లావణ్య తెలిపారు.

స్పీడ్ బ్రేకర్ల తొలగింపు


స్పీడ్ బ్రేకర్లను తొలగిస్తున్న సిబ్బంది

కాప్రా: నార్త్ కమలానగర్‌లో వేసిన స్పీడ్ బ్రేకర్లను జీహెచ్‌ఎంసీ అధికారులు శుక్రవారం తొలగించారు. స్పీడ్ బ్రేకర్ల వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు, వాహనదారుల ఫిర్యాదులతో స్పందించిన అధికారులు తొలగింపు చర్యలు చేపట్టారు. దీంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తుండగా, మరికొందరు స్పీడ్ బ్రేకర్లు తొలగింపుతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాలాలో మట్టి తొలగించాలి



మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని ఎర్రకుంట, పటేల్ కుంట నాలాలో కురుకుపోయిన మట్టిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ మేరకు శుక్రవారం ఏఈ కీర్తి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలన్నారు. దీనిపై స్పందించిన ఏఈ చెరువును సందర్శించి తక్షణమే మట్టి పూడికతీ పనులు ప్రారంభిస్తామని తెలిపినట్లు స్థానికులు పేర్కొన్నారు. కార్యక్రమంలో గద్ద క్రాంతి, కిషోర్, నూతలకంటి రాజు, మహేష్ యాదవ్, చిలుక నరేష్, రాకేష్, టోనీ తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

కాప్రా: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సీఐటీయూ మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్ల నాయకులు శుక్రవారం కమలానగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్‌తో కార్మికుల ఉద్యోగ భద్రత, హక్కులు తీవ్రంగా దెబ్బతింటున్నాయన్నారు. కనీస వేతనం రూ. 26వేలు నిర్ణయించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్‌పై సెంట్రల్ ఎక్సైజ్ తగ్గించాలని, ఆహారం, మందులు, వ్యవసాయ ఉత్పత్తులపై జీఎస్టీని తొలగించాలని డిమాండ్ చేశారు. కార్మికుల పనిగంటలు 10 గంటలు పెంచే ప్రయత్నం జరుగుతుందన్నారు. వీటిని వ్యతిరేకిస్తూ జులై 9న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శంకర్‌రావు, ఎర్ర అశోక్, ప్రవీణ్, లక్ష్మయ్య, ప్రభాకర్, ఉన్ని కృష్ణ, రేవతి కల్యాణి, శ్రీనివాస్, రాజశేఖర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

చలో రాజ్‌భవన్ పోస్టర్ ఆవిష్కరణ

కాప్రా: ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టనున్న చలో రాజ్‌భవన్ పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..మావోయిస్టులతో శాంతి చర్చలు జరపకుండా ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక గిరిజనులను, మావోయిస్టులను హతమారుస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ చలో రాజ్‌భవన్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. చత్తీస్‌ఘడ్ అడవుల్లో ఉన్న బొగ్గు, ఇనుము, సున్నపురాయి, డోలమైట్, బాక్సైట్ ఖనిజ సంపదనంతా కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేసేందుకే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు సత్యప్రసాద్, సల్మాన్, గిరిబాబు, శేఖర్, రజిని, కోమల, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

మేడిపల్లి: పీర్జాదిగూడ నగర పాలక సంస్థలో శుక్రవారం పలు అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు అందిన నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్ రావు ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్ జే.ప్రశాంతి నేతృత్వంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. 3వ డివిజన్ సాయి ఐశ్వర్య కాలనీలో అనుమతులకు మించి అదనంగా పలు అంతస్తులు నిర్మిస్తున్నట్లు గుర్తించిన టౌన్‌ప్లానింగ్ అధికారులు గోడను కూల్చివేశారు. మున్సిపల్ అనుమతుల మేరకే నిర్మాణాలు చేపట్టాలని టీపీఎస్ ప్రశాంతి సూచించారు. నగరంలో అక్రమంగా, నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న పలు నిర్మాణాలపై తమకు అందిన సమాచారంతో స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి తగు చర్యలు తీసుకోనున్నట్లు కమిషనర్ త్రిలేశ్వర్ రావు తెలిపారు.



యోగా జీవితంలో భాగం కావాలి


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కాప్రా: యోగా జీవితంలో భాగం కావాలని కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం భాష్యం స్కూల్ విద్యార్థులు భారీ ర్యాలీ చేపట్టారు. ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన అనంతరం ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి వ్యక్తి తన దినచర్యలో యోగా భాగం కావాలన్నారు. తద్వారా మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. అంతర్జాతీయ యోగా డే సందర్భంగా భాష్యం స్కూల్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు కామన్ యోగా కార్యక్రమం నిర్వహించి యోగా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాష్యం సీఈఓ చైతన్య, ప్రిన్సిపాల్ అమరేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు స్వాతి, వనిత, మేరి, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలను విక్రయిస్తున్న అంతరాష్ట్ర ముఠా అరెస్ట్

అల్వాల్: మాదక ద్రవ్యాలను విక్రయిస్తున్న అంతరాష్ట్ర ముఠాను ఎస్‌టీఎఫ్ పోలీసులు గుట్టురట్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెంగుళూరు నుంచి మాదకద్రవ్యాలను తీసుకొచ్చి నేరేడ్‌మెట్‌లో విక్రయాలు జరుపుతున్నారన్న సమాచారంతో ఎస్‌టీఎఫ్ పోలీసులు శుక్రవారం నేరేడ్‌మెట్ ప్రధాన రహదారి వద్ద ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుండి 22.08 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్ 6.06 గ్రాముల ఓజీ కుష్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.1.75 లక్షలుగా ఉంటుందని అంచనా వేశారు. నింధితులు నీరజ్ కుమార్, వినోద్‌కుమార్, బాలాజీలను అరెస్ట్ చేశారు. వీరి నుంచి మూడు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. వీరితో పాటు బెంగుళూరులో డ్రగ్స్ సరఫరా చేసే నిఖిల్‌పై కేసు నమోదు చేశారు. త్వరలో అతడిని అరెస్ట్ చేస్తామని ఎస్‌టీఎఫ్ టీమ్ లీడర్ ప్రదీప్‌రావు, ఎస్‌ఐ సంధ్య తెలిపారు.

పొరపాటును సరిదిద్దండి

- అధిక మొత్తంలో నీటి బిల్లు
- వడ్డీతో కలిపి రూ.7,45,240 బిల్లు పంపిన అధికారులు
- సమస్యను ఎండీ దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే


జలమండలి ఎండీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ విస్టా హోమ్స్‌లో అధికంగా వచ్చిన మంచినీటి బిల్లు అంశాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వాటర్ వర్క్స్ ఎండీ అశోక్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం డివిజన్ నేతలు, విస్టా హోమ్స్ ప్రతినిధులతో కలిసి ఖైరతాబాద్ వాటర్ వర్క్స్ కార్యాలయంలో ఆయనను కలిసి సమస్యను వివరించారు. ప్రతి నెల రూ.15 నుంచి రూ.20 వేలు వచ్చే నీటి బిల్లు రెండేళ్ల క్రితం ఒకే నెలకు సుమారు రూ. 6 లక్షలకు పైగా వచ్చిందని, సమస్యను అప్పట్లోనే వాటర్‌వర్క్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. తప్పిదం జరిగిందని గుర్తించిన అధికారులు మీటర్‌ను మార్చినా బిల్లు సవరించక పోవడంతో బిల్లు యధావిధిగా వస్తుందని ఎండీకి వివరించారు. పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని తాజాగా వడ్డీతో కలిపి రూ.7,45,240 చెల్లించాలని చెప్పడంతో విస్టా హోమ్స్ ప్రతినిధులు డివిజన్ నేతలతో కలిసి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి సమస్యను వివరించడంతో ఆయన సమస్యను వాటర్‌వర్క్స్ ఎండీ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎండీ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేత నేమూరి మహేష్‌గౌడ్, విస్టాహోమ్స్ ప్రతినిధులు జైపాల్‌రెడ్డి, వీరబ్రహ్మాచారి, నర్ర వీరభద్రరావు, భాస్కర్, భరణి తదితరులు పాల్గొన్నారు.